29-05-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## " మధురమైన పిల్లలారా - మీకు నషా ఉండాలి - ఏ శివునినైతే అందరూ పూజిస్తున్నారో, వారు మాకిప్పుడు తండ్రిగా అయ్యారు. మేము వారి సన్ముఖములో కూర్చొని ఉన్నాము "

**ప్రశ్న :-** మనుష్యులు భగవంతుని క్షమాపణ ఎందుకు కోరుకుంటారు? వారికి క్షమాపణ లభిస్తుందా?

**జవాబు :-** మేము చేసిన పాపకర్మల శిక్షను భగవంతుడు ధర్మరాజు ద్వారా ఇప్పిస్తారని భయము ఉన్నందువలన మనుష్యులు భగవంతుని క్షమించమని వేడుకుంటారు. కాని వారు చేసిన కర్మల శిక్షను కర్మభోగ రూపములో తప్పకుండా అనుభవించాల్సిందే. భగవంతుడు వారికే మందును ఇవ్వరు. గర్భజైలులో కూడా శిక్షలు అనుభవించాలి. మీరు ఏమేం చేశారో అవన్నీ సాక్షాత్కారమవుతాయి. ఈశ్వరీయ ఆదేశానుసారంగా నడుచుకోలేదు కనుక మీకు ఈ శిక్ష తప్పదు అని సాక్షాత్కారమవుతుంది. **పాట :- నిదురించి రాత్రిని పోగొట్టుకున్నారు ...... (తూనే రాత్ గవాయి........)**

ఓంశాంతి. ఇది ఎవరన్నారు? ఆత్మిక తండ్రి అన్నారు. వారు అత్యంత ఉన్నతులు. మనుష్యులందరి కంటే, ఆత్మలందరి కంటే శ్రేష్ఠమైనవారు. అందరిలో ఉండేది ఆత్మనే కదా! శరీరము కేవలం పాత్రను అభినయించేందుకు లభించింది. ఇప్పుడు మీరు చూస్తున్నారు - సన్యాసులు మొదలైన వారి శరీరానికి కూడా చాలా గౌరవముంది. తమ గురువులు మొదలైనవారిని ఎంతగానో మహిమ చేస్తారు. కాని ఇక్కడ అనంతమైన తండ్రి చాలా గుప్తంగా ఉన్నారు. పిల్లలైన మీరు - శివబాబా చాలా శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనవారు, వారికంటే శ్రేష్ఠమైనవారు ఎవ్వరూ లేరని భావిస్తారు. ధర్మరాజు కూడా వారి జతలో ఉన్నారు. ఎందుకంటే భక్తిమార్గములో క్షమాపణ అడుగుతారు - హే భగవంతుడా! క్షమించు. ఇప్పుడు భగవంతుడు ఏం చేస్తారు ? ఇక్కడి ప్రభుత్వము జైలులో వేస్తుంది. అక్కడ ధర్మరాజు గర్భజైలులో శిక్షను విధిస్తారు. ఆ శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. దీనిని కర్మభోగము అని అంటారు. ఇప్పుడు కర్మభోగాన్ని అనుభవించేది ఎవరో మీకు తెలుసు. ఏమవుతుంది? హే ప్రభూ! క్షమించండి, దు:ఖాన్ని దూరము చేయండి. సుఖాన్ని ఇవ్వండి అని వేడుకుంటారు. ఇప్పుడు భగవంతుడు ఏదైనా వైద్యమేమైనా చేస్తారా ? వారు ఏమీ చేయలేరు. అప్పుడు భగవంతునికి ఎందుకు చెప్పాలి? ఎందుకంటే భగవంతునితో పాటు ధర్మరాజు కూడా ఉన్నారు. చెడు కర్మ చేసినందున ఖచ్చితంగా అనుభవించాల్సి వస్తుంది. గర్భజైలులో శిక్ష కూడా లభిస్తుంది. అన్నీ సాక్షాత్కారమవుతాయి. సాక్షాత్కారాలు చేయించకుండా శిక్షలు లభించవు. గర్భజైలులో ఏ మందూ మొదలైనవేవీ ఉండవు. అక్కడ శిక్షను అనుభవించాల్సి వస్తుంది. దు:ఖము కలిగినప్పుడు భగవంతుడా! మమ్ములను ఈ జైలు నుండి విడుదల చేయండి అని చెప్తారు.

ఇప్పుడు పిల్లలైన మీరు ఎవరి సన్ముఖములో కూర్చొని ఉన్నారు? శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన తండ్రి సన్ముఖములో. కానీ వారు గుప్తంగా ఉన్నారు. ఇతరులందరి శరీరాలు కనిపిస్తాయి. ఇక్కడ శివబాబాకు తమ చేతులు, కాళ్ళు మొదలైనవి లేనే లేవు. పుష్పాలు మొదలైనవి కూడా ఎవరు తీసుకుంటారు? ఒకవేళ ఇష్టపడితే, ఇతని చేతుల ద్వారానే తీసుకోవలసి వస్తుంది. కాని ఎవ్వరి నుండి తీసుకోరు. మమ్ములను ఎవ్వరూ తగలవద్దని శంకరాచార్యులు అంటాడు అలాగే పతితుల నుండి ఏమైనా నేను ఎలా తీసుకుంటాను? మాకు పుష్పాలు మొదలైనవాటి అవసరమే లేదని తండ్రి అంటున్నారు. భక్తిమార్గములో సోమనాథుని మందిరము నిర్మించి పుష్పాలను అర్పిస్తారు. కాని నాకు శరీరమే లేదు. ఆత్మను ఎవరైనా ఎలా ముట్టుకోగలరు! పతితుల నుండి పుష్పాలు ఎలా స్వీకరించాలి? అని అంటారు. ఎవ్వరి చేయి

కూడా తగలరాదు. పతితులు తాకను కూడా తాకరాదు. ఈరోజు బాబా అని అంటారు రేపు మళ్లీ నరకవాసులుగా అవుతారు. అటువంటి వారిని చూడను కూడా చూడను. తండ్రి చెప్తున్నారు - నేను సర్వశ్రేష్ఠమైన వాడిని. ఈ సన్యాసులు మొదలైన వారందరిని కూడా డ్రామానుసారము నేనే ఉద్ధరించవలసి వస్తుంది. నా గురించి ఎవ్వరికీ తెలియదు. శివుని పూజిస్తారు. కాని వీరు గీతా భగవంతుడని, ఇక్కడికి వచ్చి జ్ఞానాన్ని ఇస్తారనే విషయము వారికి తెలియదు. గీతలో కృష్ణుని పేరు వేసేశారు. కృష్ణుడు జ్ఞానము ఇచ్చినట్లయితే, శివుడు ఏం చేసినట్లు ? కనుక శివుడు రానే రాడని మనుష్యులు భావిస్తారు. అరే! పతితపావనుడు కృష్ణుడు కానే కాదు. పతితపావనుడని కేవలం నన్ను మాత్రమే అంటారు కదా! మీలో కూడా కొద్దిమంది మాత్రమే అంతటి గౌరవాన్ని ఇస్తున్నారు. బాబా ఎంత సాధారణంగా ఉంటారు! సన్యాసులు మొదలైన వారందరికీ నేను తండ్రినని అర్థము చేయిస్తున్నారు. శంకరాచార్యులు మొదలైనవారి ఆత్మలందరికీ నేను తండ్రిని. అందరికీ శారీరిక తండ్రి ఉండనే ఉంటాడు. నేను సర్వాత్మలకు తండ్రిని. నన్ను అందరూ పూజిస్తారు. ఇప్పుడు ఆ తండ్రి ఇక్కడ సన్ముఖములో కూర్చొని ఉన్నారు. కాని ఎవరి ముందు కూర్చొని ఉన్నామనే విషయం అందరూ అర్థము చేసుకోరు.

ఆత్మలు జన్మ-జన్మాంతరాలుగా దేహాభిమానానికి అలవాటు పడినందున తండ్రిని స్మృతి చేయలేరు. దేహమునే చూస్తూ ఉంటారు. ఆత్మాభిమానులుగా అయితే ఆ తండ్రినే స్మృతి చేసి వారి శ్రీమతానుసారము నడుస్తారు. నన్ను తెలుసుకునేందుకు అందరూ పురుషార్థము చేస్తున్నారు. చివరిలో పూర్తి దేహీ-అభిమానులుగా అయ్యే వారే ఉత్తీర్ణులవుతారు. మిగిలిన వారందరిలో కొద్ది కొద్దిగా దేహాభిమానము ఉంటుంది. తండ్రి ఏమో గుప్తంగా ఉన్నారు. వారికి ఏమీ ఇవ్వలేరు. పిల్లలు శివాలయానికి కూడా వెళ్లి అర్థము చేయించవచ్చు. కుమారీలే శివబాబా పరిచయమునిచ్చారు. కుమార - కుమారీలు ఇరువురూ ఉన్నారు. కుమారులు కూడా పరిచయము ఇచ్చి ఉండవచ్చు. మాతలు పురుషులకంటే ఎక్కువ సర్వీసు చేసినందున విశేషంగా మాతలను ఉన్నతంగా చేస్తారు. కావున పిల్లలలో సర్వీసు చేసేందుకు ఆసక్తి ఉండాలి. ఆ చదువు పై కూడా చాలా అభిరుచి ఉంటుంది కదా. అది భౌతికము. ఇది ఆత్మికము. భౌతిక విద్యను అభ్యసించి, ఆ డ్రిల్లు మొదలైనవి నేర్చుకున్నా ఏమీ లభించదు. ఎవరికైనా కొడుకు జన్మించాడనుకోండి చాలా వైభవంగా, అట్టహాసంగా వారి ఛఠీ(శిశువు జన్మించిన ఆరవ రోజు చేసే స్నాన పూజాదులు) మొదలైన వాటిని జరుపుతారు. కాని వారికి ఏం లభిస్తుంది! ఏదైనా పొందుకునేందుకు అంత సమయము కూడా లేదు. ఇక్కడ నుండి వెళ్లి జన్మ తీసుకున్నా వారికి కూడా ఏమీ అర్థము కాదు. ఇక్కడ నుండి మరణించి వెళ్లిన వారైతే నేర్చుకొని వెళ్లి ఉంటే దాని అనుసారంగా చిన్న వయస్సులోనే శివబాబాను స్మృతి చేస్తూ ఉండవచ్చు. ఇది మంత్రము కదా. చిన్న పిల్లలకు నేర్పించినా వారు ఈ బిందువు మొదలైనవేమీ అర్థము చేసుకోలేరు. కేవలం శివబాబా - శివబాబా అని అంటూ ఉంటారు. శివబాబాను స్మృతి చేస్తే, స్వర్గ వారసత్వాన్ని పొందుతారు. ఇలా వారికి అర్థం చేయిస్తే వారు కూడా స్వర్గములోకి వచ్చేస్తారు. కాని ఉన్నతమైన పదవిని పొందలేరు. ఇలా శివబాబా శివబాబా అనే పిల్లలు చాలామంది వస్తారు. తర్వాత అంతమతి సోగతి అయిపోతుంది. రాజధాని స్థాపన అవుతూ ఉంది. మనుష్యులు శివపూజలు చేస్తారు కాని వారికి ఏమీ తెలియదు. చిన్న పిల్లలు అర్థము తెలియకుండా శివ - శివ అన్నట్లు ఉంటుంది. శివ పూజ చేసే మనుష్యులకు శివుని పరిచయమే లేదు. ఎలా చిన్న పిల్లలు శివ - శివ అని అంటూ ఉంటారో, అర్థము చేసుకోరో అలా ఇక్కడ కూడా పూజలు చేస్తారు కాని కొద్దిగా కూడా శివుని పరిచయము లేదు. కావున వారికి మీరు అర్థం చేయించాలి. మీరు ఎవరిని

పూజిస్తున్నారో వారే జ్ఞానసాగరులు, గీతా భగవానుడు. వారు మమ్ములను చదివిస్తున్నారు. ఈ ప్రపంచములో శివబాబా మాకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారని చెప్పేవారు ఎవ్వరూ లేరు. ఇది మీకు మాత్రమే తెలుసు అయినా మీరు మర్చిపోతారు. భగవానువాచ, నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. ఎవరు చెప్పారు - భగవానువాచ, కామము మహాశత్రువు, దీని పై విజయము పొందండి. పాత ప్రపంచాన్ని సన్యసించండి. మీరు హఠయోగులు, హద్దులోని సన్యాసులు. వారు శంకరాచార్యులు, మీరు శివాచార్యులు. వారు మనకు నేర్పిస్తారు. కృష్ణ ఆచార్య అని అనరు. అతడు చిన్న బాలుడు. సత్యయుగంలో జ్ఞానము అవసరము ఉండదు.

ఎక్కడెక్కడ శివుని మందిరాలున్నాయో అక్కడ పిల్లలైన మీరు మంచి సేవ చేయగలరు. శివాలయాలకు వెళ్ళండి. మాతలు వెళ్తే బాగుంటుంది, కన్యలు వెళ్తే ఇంకా మంచిది. ఇప్పుడింకా మనము బాబా నుండి రాజ్యభాగ్యమును తీసుకోవాలి. తండ్రి మనలను చదివిస్తారు. తర్వాత మనము మహారాజా మహారాణిగా అవుతాము. శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనవారు తండ్రే, ఇటువంటి శిక్షణను ఏ మనుష్యులూ ఇవ్వలేరు. ఇది కలియుగము. సత్యయుగములో వీరి రాజ్యముండేది. వీరు రాజా-రాణులుగా ఎలా అయ్యారు, వీరికి రాజయోగమును ఎవరు నేర్పించారు? వీరు సత్యయుగానికి అధిపతులుగా ఎలా అయ్యారు? ఎవరిని మీరు పూజిస్తున్నారో వారు మనలను చదివించి సత్యయుగానికి అధికారులుగా చేస్తారు. బ్రహ్మ ద్వారా స్థాపన, విష్ణువు ద్వారా పాలన,............... పతిత ప్రవృత్తిమార్గము వారే పావన ప్రవృత్తి మార్గములోకి వెళ్తారు. బాబా, పతితులైన మమ్ములను పావనంగా చేయండి, పావనంగా చేసి ఇలాంటి దేవతలుగా చేయండి అని కూడా అంటారు. అది ప్రవృత్తి మార్గము. బాబా నివృత్తి మార్గము వారికి గురువుగా అవ్వనే అవ్వరు. ఎవరు పవిత్రంగా అవుతారో వారికి గురువుగా అవ్వవచ్చు. ఇంకా చాలామంది ఇలా కంపానియన్లుగా(సహచరులుగా) కూడా ఉంటారు కాని వికారాల కొరకు వివాహము చేసుకోరు. పిల్లలైన మీరు ఈ విధంగా సర్వీసు చేయవచ్చు. మీకు ఆంతరికములో అభిరుచి ఉండాలి. మేము బాబాకు సుపుత్ర పిల్లలమై ఎందుకు సేవ చేయరాదు! పాత ప్రపంచ వినాశనము ఎదురుగా నిల్చొని ఉంది. ఇప్పుడు శివబాబా చెప్తున్నారు - కృష్ణుడు ఇలా చెప్పేందుకు సాధ్యము లేదు. వారు ఒకేసారి సత్యయుగంలో వస్తారు, వేరే జన్మలో అదే రూపురేఖలు, అదే పేరు ఉండదు. 84 జన్మలలో 84 ముఖాలు. కృష్ణుడు ఈ జ్ఞానాన్ని ఎవ్వరికీ నేర్పించలేడు. ఆ కృష్ణుడు ఇక్కడకు ఎలా రాగలడు. ఇప్పుడు మీరు ఈ విషయాలు అర్థం చేసుకుంటారు. అర్ధకల్పము మంచి జన్మలు లభిస్తాయి. తర్వాత రావణరాజ్యము ప్రారంభమవుతుంది. మనుష్యులు పూర్తిగా జంతువుల వలె అయిపోతారు. పరస్పరము పోట్లాడుకుంటూ ఉంటారు. అంటే రావణుని జన్మ జరిగింది కదా. అంతేకాని 84 లక్షల జన్మలు లేవు. ఇన్ని వెరైటీలు ఉన్నాయి. ఇన్ని జన్మలు ఎవ్వరూ తీసుకోరు. ఈ తండ్రి కూర్చొని ఈ విషయాలన్నీ అర్థం చేయిస్తున్నారు. వారు సర్వ శ్రేష్ఠమైన భగవంతుడు, వారు చదివిస్తారు, తర్వాత ఇతను కూడా ఉన్నాడు కదా. చదవలేదంటే ఎవరి వద్దకైనా వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు. శివబాబా వద్దకు వచ్చి దాస-దాసీలుగా అవుతారా? తండ్రి అర్థం చేయిస్తున్నారు, చదవకుంటే సత్యయుగంలో వెళ్ళి దాస-దాసీలుగా అవుతారు. ఎవరు సర్వీసు చేయకుండా కేవలం తింటూ, తాగుతూ, నిదురిస్తూ ఉంటారో అటువంటివారు ఏమౌతారో అర్థము చేసుకోగలరు కదా! మనమేమో మహారాజులుగా అవుతాము. అటువంటివారు మన ఎదురుగా కూడా రాలేరు. మేమలా అవుతామని వారికి కూడా అర్థమవుతుంది. అయినా వారికి సిగ్గే కలగదు. మేము ఎంతో కొంత చేసుకుని కొంతైనా పొందాలని అనుకోరు. ఈ బ్రహ్మ చెప్తున్నారని ఎప్పుడూ

అనుకోకండి. ఎల్లప్పుడూ శివబాబానే చెప్తున్నారని భావించండి. శివబాబాను గౌరవించాలి కదా. వారి జతలో ధర్మరాజు కూడా ఉన్నాడు. లేకుంటే ధర్మరాజు శిక్షలు కూడా చాలా అనుభవిస్తారు. కుమారీలు చాలా తెలివిగా ఉండాలి. ఇక్కడ విన్నప్పుడు బాగుందనుకోవడం, వెలుపలికి వెళ్ళగానే సమాప్తమవ్వడం ఉండరాదు. భక్తిమార్గములో ఎంత సామాగ్రి ఉందో చూడండి. ఇప్పుడు బాబా చెప్తున్నారు - విషాన్ని త్యజించండి. స్వర్గ వాసులుగా అవ్వండి. ఇటువంటి నినాదాలను తయారు చేయండి. ధైర్యము గల సింహాలుగా అవ్వండి. బేహద్ తండ్రి లభించిన తర్వాత కూడా ఇక చింత ఎందుకు? ప్రభుత్వము ధర్మాన్నే అంగీకరించకుంటే మరి వారంతా మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు ఎలా వస్తారు? వారు మేము ఏ ధర్మాన్నీ అంగీకరించమని చెప్తారు. మాకందరూ ఒక్కటే అని అంటారు. మరి పరస్పరము ఎందుకు పోట్లాడుకుంటారు? ఎక్కడ చూసినా అసత్యమే అసత్యము. సత్యము గురిగింజంత కూడా లేదు. మొట్టమొదట ఈశ్వరుడు సర్వవ్యాపి అనడంతోటే అసత్యము ప్రారంభమవుతుంది. హిందూ ధర్మమనేదే లేదు. క్రైస్తవులది తమ ధర్మమే కొనసాగుతూ వస్తోంది. వారు తమ ధర్మాన్ని మార్చుకోరు. ఈ ఒక్క ధర్మము వారు మాత్రమే తమ ధర్మమును మార్చుకొని హిందువులమని చెప్పుకుంటారు. అంతేకాక శ్రీ శ్రీ ఫలానా అని అంటారు. ఇప్పుడు శ్రీ అంటే శ్రేష్ఠులు మరి శ్రేష్ఠమైనవారు ఎక్కడున్నారు! ఎవ్వరిదీ శ్రీమతము కాదు. ఇవన్నీ వారి ఇనుప యుగపు మతాలు. వాటిని శ్రీమతమని ఎలా అంటారు? ఇప్పుడు కుమారీలైన మీరు ధైర్యంగా నిల్చుకుంటే ఎవరికైనా అర్థం చేయించగలరు. కాని యోగయుక్తులైన మంచి తెలివైన పిల్లలు కావాలి. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. మీ ఉన్నతి కొరకు తండ్రి సేవలో తత్పరులై ఉండాలి. కేవలము తినడం, త్రాగడం, నిద్రపోవడం - ఇది పదవిని పోగొట్టుకోవడమే అవుతుంది.
2. తండ్రిని, చదువును గౌరవించాలి. ఆత్మాభిమానులుగా అయ్యేందుకు పూర్తిగా పురుషార్థము చేయాలి. తండ్రి శిక్షణలను పూర్తిగా ధారణ చేసి సుపుత్రులుగా అవ్వాలి.

## వరదానము :- " స్వయాన్ని విశ్వసేవకు అర్పించి మాయను దాసిగా చేసుకునే సహజ సంపన్న భవ "

ఇప్పుడు మీ సమయాన్ని, సర్వ ప్రాప్తులను, జ్ఞానము, గుణాలు, శక్తులను విశ్వ సేవార్థము సమర్పించండి. ఏ సంకల్పము ఉత్పన్నమైనా అది విశ్వ సేవ కొరకు ఉందా అని చెక్ చేసుకోండి. ఇలా సేవ కొరకు అర్పణమౌతే స్వయం సహజంగా సంపన్నమౌతారు. సేవ చేయాలనే పట్టుదల(లగ్నం) ఉంటే చిన్న - పెద్ద పరీక్షలు స్వతహాగా సమర్పణమౌతాయి. అప్పుడు మాయతో భయపడరు. సదా విజయులుగా అయిన సంతోషంలో నాట్యము చేస్తూ ఉంటారు. మాయను మీ దాసిగా అనుభవం చేస్తారు. స్వయం సేవలో సరెండర్ అయితే మాయ స్వతహాగా సరెండర్ అవుతుంది.

## స్లోగన్:- " అంతర్ముఖత ద్వారా నోరు మూసుకుంటే క్రోధం సమాప్తమౌతుంది. "